క్లుప్తంగా

నారుమడి దుక్కు పనుల్లో రైతులు



ట్రాక్టర్‌తో నారుమడి దుక్కి చేస్తున్న రైతు

రాంబిల్లి: నారుమడి దుక్కు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట సాగు కోసం రైతులు నారుమడి తయారీలో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో దుక్కు పనులు చేశారు. ట్రాక్టర్ల సాయంతో నారుమడి దుక్కు పనులు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆర్‌బీకేల ద్వారా వరి విత్తనాలను ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాయితీపై ఈ వరి విత్తనాలను సరఫరా చేయనున్నారు. కొందరు రైతులు గత ఏడాది పండించిన ధాన్యాన్ని వరి విత్తనాలుగా వినియోగించనున్నారు.

అపారిశుధ్యంతో అవస్థలు



ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన మురుగు

కోటవురట్ల : కె.వెంకటాపురం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పూడికలు పెరిగిపోవడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమల వ్యాప్తితో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడిక తీయించమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ



క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న వెంకటాపురం సర్పంచ్ తాతాజీ

మునగపాక : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ అన్నారు. వెంకటాపురంలో ఆదివారం దాతల సహకారంతో సమకూర్చిన క్రికెట్ కిట్లు క్రీడాకారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించాల్సి ఆవశ్యకత ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయివజ్రం, దాతలు మాధవవర్మ, వెంకట కాసులుబాబు, కడియం గణేష్ పాల్గొన్నారు.

బెంబేలెత్తించిన వడగాడ్పులు

రాంబిల్లి : వడగాడ్పులు బెంబేలెత్తిస్తున్నాయి. ఆదివారం వడగాడ్పులు హోరెత్తించాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వడగాడ్పులు కొనసాగాయి. దీంతో రైతులు, కూలీలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. దుకాణాలు సాయంత్రం ఐదు గంటల వరకు తెరుచుకోలేదు. ఉదయం 10 గంటలకే దుకాణాలు మూసివేశారు. రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన రేవు పోలవరం తీరం

ఎస్.రాయవరం : రేవు పోలవరం బీచ్ ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మండలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పరిసర ప్రాంతాల వారుతో యువకులు పర్యాటకులకు పెద్ద ఎత్తున ఆదివారం తీరానికి చేరుకుని సేద తీరారు. ఉదయం నుంచి వరుసగా పెద్ద ఎత్తున పర్యాటకులు చేరుకోవడంతో రేవుపోలవరం తీరం సందడిగా మారింది.

70 ఏళ్ల కల.. ఫలించనున్న వేళ

- కళాశాల కష్టాలకు మోక్షం
- మండలానికి రెండు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం
- అందులో ఒకటి బాలికలకు కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఇంటర్ తరగతుల నిర్వహణకు ప్రతిపాదించిన మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్

మునగపాక : ఏటా 550కు పైగా విద్యార్థులు పదో తరగతి చదువుకుని ఇంటర్ చదువులకోసం ఎదురు చూస్తూ వస్తున్నారు. పది తరువాత స్థానికంగా ఇంటర్ చదువుకునేందుకు కళాశాల లేకపోవడంతో ఉన్నత చదువులకు దూరంగా ఉండాల్సి వచ్చేది. ఏళ్ల తరబడి ఉన్నత చదువుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు పదిరోజుల క్రితం తీపి కబురు అందింది. 70 సంవత్సరాలుగా తమ ప్రాంతానికి కళాశాల చదువులు కావాలంటూ ఎదురు చూస్తున్న వేళ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నెరవేరబోతుంది. విద్యార్థుల సౌలభ్యం కోసం జూనియర్ కళాశాలలు మండలానికి రెండు వంతున మంజూరు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన క్యాబినెట్‌లో ఆమోదం తెలపడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఫలితంగా ఇంటర్ చదువులు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి.

1952 తరువాత జూనియర్ కళాశాలకు అవకాశం

మునగపాకలో 1952లో జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటైంది.అప్పటిలో విద్యావేత్త మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పీవీ రమణ హైస్కూల్ వచ్చేందుకు ఎంతో శ్రమించారు. నాటి నుంచి నేటి వరకు జూనియర్ కళాశాల మంజూరు కోసం వేయికళ్లతో ఎదురు చూస్తూ వచ్చారు. పది రోజుల క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. వాటిలో ఒకటి బాల బాలికలకు కాగా మరొకటి బాలికల కోసం అనువుగా ఉండేలా రూప కల్పన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 70 సంవత్సరాల తరువాత మునగపాక మండలానికి జూనియర్ కళాశాలలు అందుబాటులోకి రానుండడం విశేషం.

వ్యయ ప్రయాసలకు తెర

గతంలో పదో తరగతి తరువాత ఇంటర్ చదువుకునేందుకు అటు అనకాపల్లి లేదా విశాఖ వెళ్లాల్సి వచ్చేది. బాలికలను ఇంటర్ చదివించేందుకు తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. పదో తరగతితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదువుకునేందుకు విద్యార్థులు ఎంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. ఇపుడు జూనియర్ కళాశాల ఏర్పాటుతో ఆ వ్యయ ప్రయాసలకు తెరపడనుంది.

ఏటా 550 మందికి పైగా విద్యార్థులు

మండలంలోని ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మోడల్ స్కూల్, మూడు ప్రయివేటు స్కూళ్ల నుంచి పదో తరగతి చదువుకునే విద్యార్థులు ఏటా 550కు పైగా ఉంటున్నారు. వారిలో బాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

మునగపాక హైస్కూల్లో కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పలు గదులు ఖాళీగా ఉండడంతో సంబంధిత గదులను కళాశాల తరగతులకు వినియోగించేలా చర్యలు చేపడుతున్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో బాలికలకు, తోటాడ హైస్కూల్‌లో బాల, బాలికల కోసం మరో కళాశాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తోటాడ హైస్కూల్‌కు పక్కనే ఉన్న స్థలాన్ని గత ఏడాది ఇంటర్ కళాశాలకు అనువుగా ఉన్నట్టు గుర్తించారు. నాడు-నేడు కింద రూ.95 లక్షలతో 6 తరగతి గదులను నిర్మించారు.

హర్షణీయం



మండలానికి రెండు జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వర్గ సమావేశంలో ప్రకటన చేయడం సంతోషకరం. ఇంతవరకు స్థానికంగా జూనియర్ కళాశాల లేకపోవడంతో బాలికలు చదువుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల కోసం ఒకటి అలాగే బాల బాలికల కోసం మరొకటి కళాశాల మంజూరుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతోషకరం.

–మళ్ల జయలక్ష్మి, ఎంపీపీ, మునగపాక

విద్యాభివృద్ధికి ఊతం



మునగపాకలో ఇంతవరకు జూనియర్ కళాశాల లేకపోవడంతో ఉన్నత చదువులకు అవకాశం లేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వం మండలానికి రెండు జూనియర్ కళాశాలలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యా వ్యవస్థలో ఇది శుభ పరిణామం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

–వేణుగోపాలరావు, ఎంఈవో

జల్లూరులో గడప గడపకు నేడు

కోటవురట్ల: జల్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఇందులో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ పార్టీ కార్యకర్తల సమావేశం నేడు

మునగపాక : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు. మునగపాకలో పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

జగనన్న సురక్ష పథకంపై సమావేశం నేడు

కోటవురట్ల : జగనన్న సురక్షా పథకంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందని విధిగా మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా ఉంటుందని తెలిపారు.

మృగశిరలోనూ మంటలే..



నిర్మానుష్యంగా ఉన్న నక్కపల్లి జాతీయరహదారి



వడగాడ్పులకు దుకాణాలు మూసేసిన దృశ్యం

- రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- జాతీయ రహదారి నిర్మానుష్యం
- దుకాణాలు సైతం మూసివేత

నక్కపల్లి : రోహిణి కార్తెలో ఎండలు చాలా విపరీతంగా ఉంటాయని, రోళ్లు సయితం పగులుతాయని అంటుంటారు. కానీ రోహిణికి మించి మృగశిరలో ఎండలు మండి పోతున్నాయి. మృగశిర కార్తె ప్రారంభమయితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటామని, రుతుపవనాల ప్రభావం వల్ల చల్లదనం వస్తుందనుకున్న వారికి ఆశాభంగమే అయింది. సూరీడు నిప్పులు కురిపించేస్తున్నాడు. పదిరోజుల నుంచి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా వడగాడ్పులు వీస్తున్నాయి. నక్కపల్లి మండలంలో ఆదివారం 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత వడగాడ్పులు, వీచడంతో బయటకు రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. మండల కేంద్రమైన నక్కపల్లిలో జాతీయరహదారి నిర్మానుష్యంగా మారింది. రోడ్డుమీద జనసంచారం లేదు. దుకాణాలు మూసేసి వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధాన కూడలి కర్ఫ్యూని తలపిస్తోంది. ప్రతి రోజు సాయంత్రం అయ్యే సరికి వరుణుడి కరుణ కోసం ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురవుతోంది. ఉదయం తొమ్మిదినుంచే ఎండ చుర్రుమంటోంది. కొబ్బరి బొండాలు, శీతల పానీయాలకు జ్యూస్ షాపులకు గిరాకీ ఎక్కువగా ఉంది. రుతు పవనాలు ఊరిస్తున్నాయి తప్ప వాటి జాడ లేదు.

మరిణమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : మండలంలో పాటిమీద గ్రామంలో మరిణమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యేకు సర్పంచ్ శంకర్రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు.

లాలంకోడూరులో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

రాంబిల్లి : లాలంకోడూరు గ్రామంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు ఈ రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. కలిగట్ల నాగేశ్వరరావు(నాగు) జ్ఞాపకార్థం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ సేవాభావంతో పలువురు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లాలం రమణ, మురళీకృష్ణ, రెడ్డిమి రాజు పాల్గొన్నారు.

పడమటమ్మకు ప్రత్యేక పూజలు

కశింకోట : విసన్నపేట వద్ద వెలసిన పడమటమ్మకు ఆదివారం పూజలు, హోమం నిర్వహించారు. గురువు సాంబమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. అమ్మవారిని అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు



పేటసూదిపురం చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

ఎస్.రాయవరం : పేటసూదిపురం గ్రామంలో పట్టపగలే మట్టి అక్రమ రవాణా దారులు బరితెగించి రవాణా మొదలు పెట్టారు. ఆదివారం కావడంతో అధికారులు కంటపడకుండా తప్పించుకోవచ్చని స్థానిక రాజకీయ నాయకులు అండదండలతో గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులో పొక్లెయిన్ ఉపయోగించి మట్టి తవ్వకాలు ప్రారంభించారు. అలా చేపట్టిన కాసేపటికి గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ రవాణా ఆగలేదు. మరింత మంది యలమంచిలి డీఈ సుజాతకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఈ చిన్నారావు తమ సిబ్బందిని గ్రామానికి పంపించి మట్టి తవ్వకాలను నిలిపారు. అయితే అధికారులు అక్రమ మట్టి తవ్వకాలు నిలిపారు..తప్ప పొక్లెయిన్, ట్రాక్టర్లు నేరుగా చెరువులో కనిపించినప్పటికీ చర్యలు తీసుకోలేదు. ఈ గ్రామంలో జగనన్న కాలనీకి తొట్టి మట్టి ఇచ్చిన నాథుడు కనిపించలేదు కాని రైతుల పేరు చెప్పి మట్టిని అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఇరిగేషన్ ఉన్నతాధికారులు మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యలమంచిలి డీఈ సుజాతను వివరణ కోరగా మండలంలో ఏ ఒక్కరికీ మట్టి తవ్వకాలపై అనుమతులు ఇవ్వలేదని, ఆదివారం, రాత్రుళ్లు అక్రమ మార్కులు మట్టి తవ్వకాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వస్తుందని, తెలిసిన వెంటనే చర్యలు చేపడుతున్నామన్నారు. అనుమతులు లేకుండా చెరువులో వాహనాలు దింపిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

బాల సదనం.. వసతుల నిలయం

- చురుగ్గా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవ



కశింకోట బాల సదనం

కశింకోట : మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన 'బాల సదనం' అందంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల ఆదేశాల మేరకు నెలన్నర క్రితం అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బాలలకు కావలసిన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

మూడున్నర దశాబ్దాల చరిత్ర

మండల పరిషత్ ప్రాంగణంలో మూడున్నర దశాబ్దాల క్రితం బాల సదనం ఏర్పాటయింది. మొదట్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలలు వసతితోపాటు, చదువుకునేలా అవకాశం కల్పించారు. జిల్లాలోని అనాథలు, సింగిల్ పేరెంట్(తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు మాత్రమే ఉన్న) పిల్లలు, నిరుపేద కుటుంబాల పిల్లలను ఇక్కడ చేర్చుకునేవారు. 60 మంది బాలలు చదువుకోవడానికి అవసరమైన సీట్లు కేటాయించారు. భోజనం, వసతి ఇందులోనే. చదువు కోసం సమీపంలోని పాఠశాలలకు వెళ్లేవారు. అయితే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు వచ్చాక బాల సదనం ప్రవేశాలను 1 నుంచి 5వ తరగతికి వరకు పరిమితం చేశారు. 6వ తరగతి ఇంటర్ వరకు ఉన్న బాలల్ని కేజీబీవీలో చేర్పించారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలల్ని చేర్పిస్తున్నారు. అయితే వసతులే ఇక్కడ ప్రధాన సమస్య.

కొరవడిన వసతులు

బాల సదనానికి ఐదేళ్ల క్రితం నూతన భవనం నిర్మాణం చేపట్టి, బాలలకు అవసరమైన గదులను నిర్మించారు. ఇతర మౌలిక సదుపాయలను కల్పించకుండా కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పిల్లలు ఆడుకోవడానికి సరైన మైదానం లేదు. వారికి కేటాయించిన డార్మెటరీలు, రీడింగ్ రూంలు, ఇతర గదులకు వెళ్లేందుకు సరైన మార్గం కూడా ఏర్పాటు చేయలేదు.

ప్రహరీని ఎత్తు తక్కువగా నిర్మించడంతో సరైన రక్షణ లేకుండా పోయింది. ఒకచోట ప్రహరీ దెబ్బతిన్నా దాన్ని పునర్నిర్మించలేదు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ దృష్టికి బాల సదనం సమస్యల్ని స్థానిక అధికారులు తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రెండు మాసాల క్రితం జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సదనాన్ని సందర్శించి సదుపాయాల కల్పనకు అధికారులను ఆదేశించారు. పిల్లలు తమ దుస్తులు ఉతుక్కునేందుకు వాషింగ్ మెషిన్ సమకూర్చారు.

కలెక్టర్ ఆదేశాలతో పనులు

కలెక్టర్ ఆదేశాలతో నెలన్నర క్రితం బాల సదనంలో పనులు చేపట్టారు. ప్రహరీని ఎత్తు చేస్తున్నారు. పిల్లల్ని చూసేందుకు వచ్చే పేరెంట్స్, సంరక్షకులు నిరీక్షణకు వీలుగా ప్రాంగణంలో మర్రి చెట్టు, మామిడి చెట్ల కింద సిమెంట్ దిమ్మలను నిర్మించారు. చుట్టూ పూల మొక్కలతో ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే లైనింగ్ గోడలు నిర్మించారు. గదులు, డార్మెటరీలు, రీడింగ్ రూం తదితర గదులకు వెళ్లేందుకు మార్గాల ఏర్పాటు, రాళ్లూరప్పలతో నిండిన ఆట స్థలం చదును చర్యలు చేపడుతున్నారు. శనివారం స్థానిక సమగ్ర బాలికల వసతి గృహ రీమోడలింగ్ పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్, బాల సదనంలో పనులపై ఆరా తీశారు.

పూడిమడకలో ఉచిత వైద్య శిబిరం

150 మందికి వైద్య పరీక్షలు



పూడిమడకలో వైద్య శిబిరం సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సురక్ష హెల్త్ ఫౌండేషన్, శ్రీవిష్ణు ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ, బోన్ మినరల్ డెన్సిటీ టెస్టు, దంత, చర్మ, హెయిర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాల మేరకు మందులు అందజేశారు. వైద్యులు అగిగర్ల సుధీర్, సందీప్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ 3 నెలలకొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బీపీ, సుగర్ చేయించుకొని ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం ద్వారా గుండె, మెదడు సంబంధిత వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని, వెంకటరమణ పాల్గొన్నారు.


వేణుగోపాలుడి కల్యాణం నేడు

- రేపటి నుంచి జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19న ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 10.15కు జగన్నాథస్వామి ఆలయం నుంచి గవరపాలెం పెరుగుబజార్, గాంధీబొమ్మ జంక్షన్, మళ్ల వీధి, గూడ్స్‌రోడ్డు వరకు రథోత్సవం కొనసాగుతుందన్నారు. గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామికి ఈ నెల 29 వరకు ప్రతి రోజూ దశావతరాల రూపంలో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. చివరి రోజైన 29న భారీ అన్నసమారాధన అనంతరం, తిరుగు రథయాత్ర నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రలు కావాల్సిందిగా కోరారు.

తల్లిదండ్రుల త్యాగాలు మరువలేనివి


- ప్రపంచ పితృ దినోత్సవ కార్యక్రమంలో ఎంపీ సత్యవతి దంపతులు




కుటుంబ పెద్దల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ దంపతులు

అనకాపల్లిటౌన్ : తల్లి బిడ్డకు జన్మనిస్తే, ఆ బిడ్డల ఆలనా పాలనా చూసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఆశతో తండ్రి ఆరాటపడతాడని ఎంపీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆవరణలో ఆదివారం ప్రపంచ పితృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన తండ్రి దివంగత భీశెట్టి జగన్నాథరావు, అత్తమామలు కాండ్రేగుల రామజోగినాయుడు, మాణిక్యమ్మ దంపతుల చిత్రపటాలకు ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులిద్దరూ సమానమేనని, వారి త్యాగాలను పిల్లలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. తండ్రి ఎప్పుడూ నా బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశపడుతూ, అందుకు తన జీవితాన్ని ధారపోస్తారని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఆంధ్రపద్య కవితా సదస్సు అధ్యక్షుడు కోటారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం సూకరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఇద్దరి మృతి



మరియాజాన్



మంత్రి సావిత్రి

మునగపాక : మండలంలో ఒంపోలు గ్రామానికి చెందిన ఆదివారం వడదెబ్బకు తాళలేక ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రెండు రోజులుగా వడగాడ్పులతో జనం అవస్థలు పడుతున్న సంగతి తెల్సిందే. ఇందులో భాగంగా ఒంపోలు గ్రామానికి బి. మరియాజాన్(81), మంత్రి సావిత్రి(52) ఇరువురు వడగాడ్పులకు తట్టులేక మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు సతకంపట్టు దుర్గామల్లేశ్వరుల కల్యాణం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం స్వామివారి కల్యాణమహోత్సవంలో భాగంగా వ్యాపారవేత్తలు నాయుడు, యుగంధర్, పూర్ణ, అబ్బులు దంపతులు లక్ష్మీగణపతి హోమం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ 6వ వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.